క్లుప్తంగా

ఉద్యోగోన్నతి

సీతంపేట: పీఎంఆర్‌సీ విభాగంలో ఏఎంఓగా పనిచేస్తున్న పి.కోటిబాబుకు ఉద్యోగోన్నతి లభించింది. ఈయన పాలకొండ మండలం బద్దుమాసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తన కార్యాలయంలో శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ జీ.రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

పాలకొండ: మహిళల భద్రతపై శక్తి టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల ఆవరణలో మహిళా ఏఎస్సై ఝాన్సీరాణి, హెచ్‌సీ ప్రకృతాంబా, మహిళా కానిస్టేబుల్ బి. శోభారాణి శక్తి యాప్ ద్వారా పొందే సేవలను వివరించారు. అత్యవసర సమయంలో రక్షణ ఎలా పొందాలో అవగాహన కల్పించారు.

17 నుంచి విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలోని 13 మండలాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ త్రిరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద విశ్వకర్మ విగ్రహాలు నెలకొల్పి వేదపండితుల ఆధ్వర్యంలో మండవ, పూర్ణాహుతి తదితర పూజలు చేయడం జరుగుతుందన్నారు.

పోలీసులకు శిక్షణ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఈ-ధర్(ఎలక్ట్రానిక్ డీటెయిల్డ్ ఆక్సిడెంట్ రిపోర్ట్)పై చినమేరంగి, ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలోని పోలీసులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఈ-ధర్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీధర్..ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో చినమేరంగి, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలోని కురుపాం, నీలకంఠాపురం, ఎల్విన్‌పేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరినాగు హల్‌చల్

కురుపాం: మండలంలోని గొటివాడ పంచాయతీ, తెన్నుఖర్జ గిరిజన గ్రామంలో భారీ గిరినాగు హల్‌చల్ చేసింది. ఇదే గ్రామంలోని తిమ్మక సోమన్నదొర ఇంట్లో సంచరిస్తూ కనిపించిన ఈ పామును చూసి గ్రామస్తులు తీవ్ర భయాందోళన చెందారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా స్నేక్ క్యాచర్స్ వచ్చేలోపు ఆ పాము దగ్గరలోని అడవిలోకి వెళ్లిపోయిందని అటవీ శాఖ రేంజర్ గంగరాజు తెలిపారు.

వరహాలు మృతి తీరని లోటు



వరహాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళావతి, తదితరులు

పాలకొండ రూరల్: దళిత సంఘాల నాయకుడు, పౌరాణిక, సామాజిక కళాకారుడు బత్తిన వరహాలు మృతి కళారంగానికి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన వరహాలు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కళావతి శుక్రవారం పరామర్శించారు. ఆమె వెంట సర్పంచ్ రణస్థలం రమాదేవి, పార్టీ నాయకులు రాంబాబు, ఉదయ్‌కుమార్, తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: నాగావళి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆమిటి ప్రసాద్ సూచించారు. ఈ మేరకు సిబ్బందికి శుక్రవారం పలు సూచనలు చేశారు. నదిలో నీటి ప్రవాహం పెరగడం వల్ల సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలను హెచ్చరించాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకున్న పోలీస్ సిబ్బంది, మహిళా పోలీస్‌లు సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన గ్రామ సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ వినతిపత్రాన్ని అందజేస్తున్నామని, ఇంటింటికి తిరిగి సర్వే చేసే పనులు సహా ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలని సచివాలయ ఉద్యోగులను ఆయా మాతృశాఖలకు అప్పగించాలని, సమయపాలన లేని ఒత్తిడితో కూడిన పని నుంచి విడుదల కల్పించాలని, పండగ దినాలు, సెలవుదినాల్లో బలవంతపు పనులు చేయించకూడదని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌బీఆర్ పేట మీదుగా పొట్లి రహదారిలో కాజ్‌వేపై పారుతున్న నవగాం గెడ్డ నీరు



రాజుపేట గెడ్డకు జలకళ



పాలకొండ - వీరఘట్టం ప్రధాన రహదారిపై చేరిన నీరు



పొంగిపొర్లుతున్న వాగులు,వంకలు



జంపరకోట గెడ్డ పొంగడంతో మల్లివీడు పరిసర పొలాల్లోకి చేరిన వరద నీరు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రెండు రోజులుగా మండల వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదవుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి సంపకోట గెడ్డ, నవగాం గెడ్డ, పోతులగెడ్డలకు వరద నీరు చేరింది. దీంతో గెడ్డలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వర్షానికి పాలకొండ వయా పొట్లి మీదుగా ఎం.సింగుపురం వెళ్లే కాజ్‌వే పైకి వర్షపు నీరు చేరింది. అలాగే జంపరకోట పరిసర ప్రాంతాల్లో గల భూముల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ - వీరఘట్టం రహదారిలో.. ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో వర్షపు నీరు చేరడంతో అన్నివర్గాల వారు ఇబ్బందులు పడ్డారు.

రైతులే గండిని పూడ్చారు..

గరుగుబిల్లి: వర్షాల కారణంగా నెలకొన్న వరదనీటి ప్రభావానికి గుర్రై మండంలోని ఉల్లిబద్ర గ్రామ పరిసరాల్లోని జంఘావతి కాలువకు గండి పడింది. దీంతో దిగువ గ్రామాలైన తులసిరామినాయుడువలస, గొట్టివలస, గరుగుబిల్లి, పెద్దూరు గ్రామాలకు సాగునీరు సరఫరా కాని పరిస్థితి నెలకొంది. అధికారుల కోసం వేచి చూడకుండా స్థానిక రైతులే జేసీబీని ఏర్పాటు చేసుకుని మరీ గండిని తాత్కాలికంగా పూడ్చారు. దీంతో వారి పొలాలకు సాగునీటి సరఫరాకు మార్గం సుగమమైంది.



గరుగుబిల్లి: జంఝావతి కాలువ గండి వద్ద రైతులు

అన్ని గ్రామాల్లో ఆధార్ క్యాంప్‌లు



మాట్లాడుతున్న పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: అన్ని గ్రామాల్లో సంచార ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మొబైల్ ఆధార్ క్యాంప్ నిర్వాహకులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఆధార్‌కార్డులో సవరణలకు గిరిజనులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లను గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నిరసన



ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గరుగుబిల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మఠ్రాపు మహేష్ మాట్లాడుతూ పెండింగ్‌లోని నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. అలాగే ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు టి.సన్యాసిరావు, ఆర్.రాజశేఖర్, జె.లక్ష్మి, కె.జగన్‌మోహన్‌రావు, జి.శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, బి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

- ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి
- సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



ఉత్సవాల నిర్వహణపై సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథఅన్నారు. ఆలయ ఆవరణలో దసరా నవరాత్రి ఉత్సవాల సన్నాహక సమావేశం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను భాగస్వాములుగా చేసుకుని ప్రతి ఒక్కరికీ అమ్మ దర్శనం కలిగేలా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. ఉత్సవాల సమయంలో ఎక్కడా ఎటువంటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి, డీఎస్పీ ఎం. రాంబాబు, తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, ఎస్సై ప్రయోగమూర్తి, ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ కడియం చిరంజీవి, గుమ్మిడి సింహాద్రి, తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ.. అమ్మవారి నిజరూప దర్శనం ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల నిరసన



పాలకొండ: తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

తమ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు చేపడుతున్న నిరసన శుక్రవారం కూడా కొనసాగింది. తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఓ పక్క వర్షం పడుతున్నా ఉపాధ్యాయులు లెక్క చేయకుండా నిరసన చేపట్టి డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.కార్యక్రమాల్లో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– వీరఘట్టం/పాలకొండ

ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పశువైద్యశాఖ ఎ.డి సంధ్యారాణి

కురుపాం: పాడిపశువులకు వేస్తున్న ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు ఎల్.సంధ్యారాణి కోరారు. మండల కేంద్రంలోని మండల సచివాలయ పశుసంవర్ధక సహాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కోళ్లకు వచ్చే వ్యాధులు–వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు.

పెన్నులు,నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పెన్నులు,పుస్తకాలు పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. తన కుమారుడు ముఖేష్ జ్ఞాపకార్థం వితరణ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

అన్నదాతల అవస్థలు

పాలకొండ రూరల్: పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కర్షకుల కష్టాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుత కీలక దశలో వరి పంట రక్షణ, దిగుబడిలో నాణ్యత పెంచుకునేందుకు అవసరమైన యూరియా కొరత నేటికీ దొరకడం లేదు. బస్తా యూరియా కోసం అన్నదాతలు ఎండనక.. వాననక అధికారుల అనుగ్రహం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని బెజ్జి రైతుసేవా కేంద్రం వద్ద వర్షం కురుస్తున్నా యూరియా కోసం అన్నదాతలు శుక్రవారం బారులుతీరిన వైనం ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శమని చెప్పుకోవచ్చు.

అభ్యంతరాలు తొలగించండి

భామిని: తమ సాగులో ఉన్న భూములకు సంబంధించి అభ్యంతరాలను తొలగించాలని మండలంలోని సింగిడికి చెందిన దళితులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ శివన్నారాయణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దళిత సంఘ నాయకులు పారిశర్లి గణపతి, మజ్జి సంజీవరావు ఆధ్వర్యంలో దళిత మహిళలు తమ వద్ద ఉన్న పట్టాదారు పుస్తకాలు, వన్‌బీ అడంగల్ కాపీలను తహసీల్దార్‌కు చూపించారు. రీ సర్వేలో ఆ భూములను దేవదాయ భూములుగా గుర్తించడంతో నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దార్ శివన్నారాయణ తెలిపారు. ఏదిఏమైనా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ మణి ప్రభాకర్ ఉన్నారు.

యూరియా కోసం ఆందోళన తగదు

- జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి

వీరఘట్టం: యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని పార్వతీపురం మన్యం జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వద్ద శుక్రవారం జరిగిన యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఓ సౌజన్య, తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు ఉన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గోపాల్

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ అన్నారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 వైద్య కళాశాలలను పీపీపీ(పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) విధానంలో ప్రైవేటుకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు డాక్టర్ కావాలన్న ఆశలు దూరం చేయడమేనన్నారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని చూస్తున్న తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా పయనిస్తుండడం మంచి పరిణామం కాదన్నారు. ఇది ప్రజావ్యతిరేక నిర్ణయమని, దీనిపై పునరాలోచన చేయాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆకుకూరల పంటల విత్తనాలతో మహిళలు

గుమ్మలక్ష్మీపురం: ప్రతిఒక్కరూ పౌష్టికాహార పదార్థాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి తెలిపారు. మండలంలోని కొత్తవలస గ్రామంలో యస్ సొసైటీ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు, గర్భిణులు, బాలింతలంతా చిరుధాన్యాలు, దుంపజాతులు, ఆకుకూరలు, కాయగూరలు వంటివి తినడం ద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చన్నారు.

అనంతరం మునగాకు, గోదుమ, రాగిపిండితో బలవర్ధకమైన ఆహారం ఏ విధంగా తయారు చేసుకోవచ్చో అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఆకుకూరల పంటల విత్తనాలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి:పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు.మండలంలోని పెద్దూరులో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లోని మురుగుతో పాటు, రోడ్డుకు ఇరువైపులా పెంటకుప్పల్లోని చెత్తాచెదారాన్ని జేసీబీలతో తొలగించి, ట్రాక్టర్లలో ఎక్కించి దూరంగా పడవేశారు. ఈ పనులను ఎంపీడీవో పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. అందరూ చెత్తను పొడి, తడిచెత్తలుగా వేరు చేసి, గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని అప్పుడే ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, కార్యదర్శి బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం



శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల బయో రిసోర్స్ కేంద్రాల యజమానులతో శుక్రవారం నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఆయన, స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు పాల్గొని, మాట్లాడారు. ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పంటలను సాగు చేయడం వల్ల నేలసారవంతంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ప్రకృతి సేద్యానికి అవసరమైన జీవామృతాలు, కషాయాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ టీమో టిక్ లీడ్ కె.ప్రకాష్, డీపీఎం ఎం.శ్రావణ్‌కుమార్, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు స్పందన



ఖోఖోలో తలపడుతున్న బాలికలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు విశేష స్పందన వచ్చిందని పీడీ సైల పద్మరాజు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 350 మంది బాల, బాలికలు హాజరయ్యారు. వీరికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 90 మంది క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ పద్మరాజు తెలిపారు. పోటీలను ఎంఈఓ ఆర్.ఆనందరావు, గ్రామ పెద్దలు జామి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. నోడల్ ఆఫీసర్ సీహెచ్ రత్నాకరరావు, ప్రధానోపాధ్యాయులు కేపీ నాగమణి, బి.సొంబర, జి.రవిప్రసాద్, పీడీలు శిర్లాపు ఉమామహేశ్వరరావు, చందు, రాము, కృష్ణకుమారి, సాల్మన్‌రాజు, కృష్ణవేణి, ధనలక్ష్మి, నాగేశ్వరరావు, పోలిరాజు, రాంబాబు, తిరుపతినాయుడు పాల్గొన్నారు.

సీతంపేటలో భారీ వర్షం



వీరఘట్టం: వండువ జంక్షన్ వద్ద నిలిచిన పోయిన వర్షపు నీరు

సీతంపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు ఏకధాటిగా కుంభవృష్టి వర్షం కురవడంతో గెడ్డలు పొంగిపొర్లాయి. వర్షాధార పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగమని రైతులు చెబుతున్నారు.

కుండపోత..

వీరఘట్టం: మండల వ్యాప్తంగా శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రారంభమైన ఈ వర్షం 2.45 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో వండువ జంక్షన్‌కు ఇరువైపులా 500 మీటర్ల వరకు రహదారి అంతా జలమయమైంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

జియ్యమ్మవలస రూరల్: రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని తిరుమల సాయి పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి నిమ్మల జితేంద్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శంకరరావు శుక్రవారం తెలిపారు.

విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియంలో ఇటీవల జరిగిన 68వ స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగంలో జరిగిన ఫెన్సింగ్ క్రీడలో వ్యక్తిగత విభాగంలో పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు.